క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గుంటూరు రూరల్: విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని విద్యుత్ శాఖ ఏఈ బ్రహ్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవీపీ కాలనీ, శ్రీనివాసరావుతోట, 60 అడుగుల రోడ్డు, కృష్ణబాబు కాలనీ, జోసఫ్ నగర్, కోదండ రామయ్యనగర్, కొత్తకాలనీ, కావేరి కాలనీ, కామాక్షినగర్, మిర్చియార్డ్ రోడ్డు, లాలుపురం, భవానీపురం, లింగాయపాలెం, అంకిరెడ్డిపాలెం, చల్లావారిపాలెం, పొత్తూరు, నాయుడుపేట, ఓబులునాయుడుపాలెం, అంబేడ్కర్ నగర్, దాసరిపాలెం, చౌడవరం, జూనంచుండూరు తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించాలని సూచించారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

ప్రత్తిపాడు: రహస్యంగా పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను వట్టిచెరుకూరు పోలీసులు అరెస్టు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడులోని ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న సమాచారం స్పెషల్ బ్రాంచి పోలీసులకు అందింది. దీంతో ఎస్ఐ కోటేశ్వరావు, సిబ్బంది కలిసి జూద స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 17,050 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

పెదకాకాని: ఇంటి ముందు రోడ్డు మార్జిన్‌లో నిలబడిన మహిళను బైక్ ఢీ కొనడంతో తీవ్రగాయాలయ్యాయి. తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాల సమీపంలో రోడ్డుకు ఇరువైపులా నివాసాలు ఏర్పాటు చేసుకుని సుమారు 50 కుటుంబాలు వారు జీవనం సాగిస్తున్నారు. గుంటూరు వైపు నుంచి ఉప్పలపాడు వైపు వెళ్తున్న బైక్ శుక్రవారం రాత్రి వేగంగా వెళుతూ రోడ్డు పక్కనే ఉన్న నక్కా సైదమ్మ అనే మహిళను ఢీ కొంది. ఈ ఘటనలో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు బాధితురాలిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

పెదకాకాని: జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి కారు ఢీ కొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన పెదకాకానిలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. నంబూరుకు చెందిన అంబటి సాయికృష్ణ, బైక్ మెనానిక్ తాడిబోయిన శివగోపాలకృష్ణమూర్తి బైక్‌పై గుంటూరు బయలు దేరారు. గురువారం రాత్రి పెదకాకాని సమీపంలోని అమెరికన్ అంకాలజీ సమీపంలోకి చేరుకునే సరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీ కొంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరూ పక్కనే ఉన్న సర్వీసు రోడ్డులో పడిపోయారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు సాయికృష్ణ సోదరుడు అంబటి నాగ వెంకటకేశవ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో వృద్ధుడు మరణించిన ఘటన నారాకోడూరు వద్ద శుక్రవారం జరిగింది. నారాకోడూరు గుండవరం రోడ్డులోని గాయత్రీ శక్తి పీఠానికి చెందిన కసుకర్రు వీరయ్య(80) స్థానిక కెనరా బ్యాంక్ సమీపంలో జరిగిన గాయత్రి హోమం ముగించుకొని ద్విచక్ర వాహనంపై శ్యామలాంబతో కలిసి బయలు దేరారు. జీబీసీ రహదారి మీదకు వచ్చే సమయంలో గుంటూరు వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన ఇద్దరిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వీరయ్య మరణించాడు. శ్యామలాంబ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చేబ్రోలు ఎస్ఐ కె.ఆనంద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

తెనాలిరూరల్: బాలిక అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి మండలం పెదరావూరుకు చెందిన 14 ఏళ్ల బాలిక ఖ్యాతి కుసుమ శివ ఈ నెల 6వ తేదీన తెనాలి నాజరుపేటలోని స్నేహితురాలి వద్దకు వెళ్లింది. కొద్దిసేపు స్నేహితురాలి వద్ద గడిపి తిరిగి అక్కడే ఆటో ఎక్కింది. ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ ఎం. ఉమామహేశ్వరరావు శుక్రవారం రాత్రి తెలిపారు.

తెనాలి ఐటీఐలో అప్రెంటీస్ మేళా

తెనాలిఅర్బన్: తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో అప్రెంటీస్ మేళాను ఈ నెల 11న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రావి చినవెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో 15 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతోపాటు పాస్‌పోర్ట్ ఫొటోలతో ఉదయం 10 గంటలకు ఐటీఐ కళాశాలలో జరిగే మేళాలో హాజరు కావాలని కోరారు. వివరాలకు సెల్ నెంబర్ 9959828100 లో సంప్రదించాలన్నారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- అంకిరెడ్డిపాలెం హైస్కూల్ ప్లస్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు



ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు పొందిన నాగభారతిని సన్మానించిన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్‌ను అక్షరాస్యత శాతంలో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ప్రధాన ఉపాధ్యాయురాలు సరోజిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ, విప్లవాత్మకమైన సంస్కరణలతో రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమూలంగా మార్చివేశారన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వైఎస్ జగనే మళ్లీ ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రానికి సుపరిపాలన అందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు పొందిన నాగభారతిని ఘనంగా సన్మానించారు. గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, చైతన్య విద్యా సంస్థల సీఈఓ దుర్గాప్రసాద్, ఏసీ కళాశాల విశ్రాంత ప్రధాన ఆచార్యులు ముత్యం, గ్రామ పెద్దలు కుర్రా సాంబిరెడ్డి, లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, గంగాధరరెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీలో రాళ్ల సమస్యపై పరిశోధనా పుస్తకం విడుదల


పుస్తకాన్ని విడుదల చేస్తున్న చైర్మన్ వైవీ ఆంజనేయులు, ప్రిన్సిపల్

గుంటూరు రూరల్: ప్రతి సంవత్సరం భారతీయ జనాభాలో 12 శాతం మంది మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యతో సతమతమవుతున్నారని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. శుక్రవారం లాం నందున్న కళాశాలలో మూత్ర పిండాల్లో రాళ్ల సమస్య పరిశోధనపై పుస్తకం విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కిడ్నీలో రాళ్ల సమస్యను సమాలంలో గుర్తిస్తే శాశ్వత నష్టం కలగకుండా, శస్త్ర చికిత్స లేకుండా ప్రకృతి మూలికల ద్వారా నివారించవచ్చని తెలిపారు. మూత్రపిండాల్లో రాళ్ళు తరచుగా మూత్రం కేంద్రీకృతమైనప్పుడు ఖనిజాలు స్పటికీకరణ వల్ల ఏర్పడి మూత్రనాళాల్లో ఏ భాగాన్నయినా ప్రభావితం చేయవచ్చన్నారు. ఫార్మాంకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఈశ్వర్‌టోని మాట్లాడుతూ.. సహజసిద్ధ ప్రకృతి మూలికలతో ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా చికిత్సను అందించటమే లక్ష్యంగా ఇటువంటి జంతు ప్రయోగాల ద్వారా తొలిదశలో ప్రయోగం విజయం సాధించటం జరిగిందన్నారు. ఈ విధంగా విజయవంతమైన ప్రక్రియను పుస్తకరూపంలో పొందుపరచటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డి.ఈశ్వర్‌టోనిని చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు సత్కరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నగదు చెక్కు అందజేత


మాలతికి నగదు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. శుక్రవారం గుంటూరు కృష్ణనగర్‌లోని ఆయన కార్యాలయంలో పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన గంగిశెట్టి మాలతికి వైద్య సహాయం కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేలు చెక్కును ఎమ్మెల్యే రోశయ్య అందజేశారు.

బైక్ దగ్ధం



పెదనందిపాడు: ఇంటిలో పెట్టిన బైక్ దగ్ధమైన ఘటన నాగులపాడు గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు కావు వెంకట సుబ్బారావు వివరాల మేరకు.. రాత్రి 10.30 గంటల సమయంలో నాగులపాడు గ్రామంలోని తన ఇంటి వద్ద సుబ్బారావు బైక్ పెట్టాడు. ఇంటికెళ్లిన అరగంటకు స్థానికులు ఫోన్ చేసిబైక్ దగ్ధమవుతోందని అతనికి తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల బైక్ దగ్ధమైనట్లు సుబ్బారావు తెలిపారు. అయితే బైక్ దగ్ధంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

పొన్నూరు: వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు అన్నారు. నిడుబ్రోలులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సలహా మండలి మండల చైర్మన్ లంకపోతు పిచ్చిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి డి. వెంకట్రామయ్య మాట్లాడుతూ మండలంలోని తుంగభద్ర సైడ్ కెనాల్, శ్రీ రంగపురం, 1,2, పొన్నూరు, జూపూడి, మన్నవ కాలువల కింద వున్న 30 వేల ఎకరాల వరిసాగు పొలం ఉందని తెలిపారు. ఈ సీజనకు 60 శాతం మాత్రమే నీటి లభ్యత ఉందని తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ అధికారులు షేక్. మహమ్మద్ రఫీ, షేక్. మస్తాన్‌వలి, రైతులు పాల్గొన్నారు.

వీఎల్ఎస్ఐలో పట్టు సాధిస్తే అపార అవకాశాలు

జేఎన్టీయూ కాలేజ్ ప్రొఫెసర్ సత్య సావిత్రి


ప్రొఫెసర్ సత్యసావిత్రిని సన్మానిస్తున్న అధ్యాపకులు

గుంటూరు రూరల్: ఇంజినీరింగ్ విద్యలో ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు వీఎల్ఎస్ఐ అనే అంశంపై పట్టు సాధిస్తే అపార అవకాశాలు పొందవచ్చని, హైదరాబాద్ జేఎన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ టి.సత్య సావిత్రి తెలిపారు. శుక్రవారం పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో వీఎల్ఎస్ఐ సాంకేతికత ఉపయోగాలు, ఇంటిగ్రేటెడ్ చిప్ ఫాబ్రికేషన్ విధానంపై గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యంతో కూడిన విద్యా విధానాల ద్వారా ప్రస్తుత సమాజంలో త్వరితగతిన ఉపాధి పొందవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాధిక, ఈసీఈ విభాగాధిపతి జి.సంధ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రియదర్శిని కళాశాలలో మెగా జాబ్‌మేళా


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం పుల్లడగుంటలో ఉన్న ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ చందు రామారావు మాట్లాడారు. ఈ జాబ్ మేళాకు వివిధ కళాశాలలకు చెందిన 606 మంది విద్యార్థులు, అభ్యర్థులు పాల్గొనగా, 26 ప్రముఖ కంపెనీలు ప్రాంగణ ఎంపికలను నిర్వహించాయన్నారు. 148 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె.కిరణ్‌కుమార్, డైరెక్టర్ డాక్టర్ చందు రవికుమార్, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ కె.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థి ప్రతిభ

రూ. 16.3 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం


విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యా సంవత్సర ప్రారంభ దశలోనే అధిక ప్యాకేజీతో ఉద్యోగాలు కల్పించేందుకు అంతర్జాతీయ కంపెనీలు తమ కళాశాల విద్యార్థుల ఎంపికకు ముందుకు రావడం శుభ సూచికమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ అంతర్జాతీయ సాఫ్ట్ వెర్ కంపెనీ డార్విన్ బాక్స్ డిజిటల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో కళాశాలలో బిటెక్ చివరి సంవత్సరం సీఎస్ఈ చదువుతున్న ఆఫ్రిన్ మొహమ్మద్ రూ.16.30లక్షల ప్యాకేజీతో ఉద్యోగ అవకాశం లభించిందన్నారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, డాక్టర్ ఎం.శ్రీలత, సీహెచ్ శ్రీనివాసరావు, వి.జగదీష్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెరువు ఆక్రమణలు


పెదకాకాని పల్లాలమ్మ చెరువు ఆక్రమించుకుని గోడౌన్ నిర్మాణం

పెదకాకాని: చెరువు యథేచ్ఛగా ఆక్రమణలకు గురి అవుతున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. పెదకాకాని జాతీయ రహదారి పక్కనే పల్లాలమ్మ చెరువు ఉంది. రైల్వేట్రాక్ నుంచి జాతీయ రహదారి వరకూ విస్తరించి ఉన్న ఈ చెరువు ప్రస్తుతం కుచించుకుపోయి 40 ఎకరాల చెరువు కాస్తా 20 ఎకరాలకు మిగిలింది. ఇప్పటికీ ఆ చెరువులో ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. భూగర్భ జలాలను కాపాడుకునేందుకు గతంలో ఏర్పాటు చేసిన చెరువు ఆక్రమించుకుని ఏకంగా గోడౌన్ ఏర్పాటు చేశారు. అందులో మిషనరీ ఏర్పాటు చేసి, ఆ మిషనరీ ద్వారా వచ్చే వ్యర్థాలను చెరువులోకి వదులుతున్నారు. చెరువులో ఇళ్లు వేసుకోవడం, వర్షానికి ఆ గుడిసెలు మునగడం పరిపాటిగామారింది. గ్రామంలో రోజు రోజుకూ చెరువు ఆక్రమణకు గురవుతున్నప్పటికీ పంచాయతీ, రెవెన్యూ అధికారులు కానీ స్పందించకపోగా చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువు ఆక్రమణలను అరికట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

'విజ్ఞాన్' వర్సిటీలో వరలక్ష్మి వ్రత వేడుకలు


వరలక్ష్మి వ్రతం పూజలో పాల్గొన్న విద్యార్థులు

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వర్సిటీ సిబ్బంది, విద్యార్థులు సామూహిక వ్రత పూజలు చేశారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ అష్ట లక్ష్మిలలో వరలక్ష్మీదేవికి ఓ ప్రత్యేకత ఉందని, మిగిలిన లక్ష్మీ పూజలకంటే వరలక్ష్మీ పూజ శ్రేష్టమని తెలిపారు. విఘ్నేశ్వర పూజ అనంతరం వరలక్ష్మీ వ్రతం కొనసాగింది. కళాశాల విద్యార్థినులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ ఎంపీడీఓగా ఆదినారాయణరావు


ఎంపీడీఓ ఆదినారాయణరావు

గుంటూరు రూరల్: గుంటూరు రూరల్ ఎంపీడీఓగా ఎస్.ఆదినారాయణరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన కొవ్వూరు మండలం ఈవోపీఆర్డీగా పనిచేసి పదోన్నతిపై గుంటూరు రూరల్ మండలం ఎంపీడీవోగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ మండలం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగుతాయని తెలిపారు. ఆదినారాయణకు వివిధ విభాగాల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి భరోసా


అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు అధికారిణి రాజకుమారి

కొల్లిపర: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు అధికారిణి రాజకుమారి సూచించారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో డ్వాక్రా యానిమేటర్లకు, ప్రకృతి వ్యవసాయ ఇంటర్నల్ రిసోర్స్ పర్సన్‌లకు రెండవ రోజు ప్రకృతి వ్యవసాయంలోని 2016 నుంచి ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ న్యాచురల్ వ్యవసాయం దానిలో మహిళా సంఘాల పాత్ర గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చీడ పీడల నుంచి పంటలను కాపాడటానికి సేంద్రియ సిబ్బంది తయారు చేసిన కషాయాలను వినియోగించాలన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ న్యాచురల్ వ్యవసాయం ఆవశ్యకత, సార్వత్రిక సూత్రాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ జిల్లా ప్రాజెక్టు అధికారిణి జానకి , డీఎల్ఎంటీ సత్యనారాయణ, మండల్ ఎన్ఎఫ్ఏ నాగలక్ష్మి, ఏపీఎం ప్రియదర్శిని, వెలుగు సీసీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

గుంటూరు మిర్చియార్డు డైరెక్టర్ ఇంద్ర


మిర్చియార్డ్ డైరెక్టర్ ఇంద్రను సన్మానిస్తున్న డీబీఎఫ్, ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు రూరల్: రైతుల సంక్షేమం కోసం, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నారని గుంటూరు మిర్చియర్డ్ డైరెక్టర్ బందలపాటి వెంకటేశ్వరరావు (ఇంద్ర) తెలిపారు. శుక్రవారం దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సత్కార కార్యక్రమాన్ని నగరంలోని డీబీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్ర మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదాలతో తనకు ఈ పదవి వచ్చిందన్నారు. జీవితం ఉన్నంత వరకు పేద ప్రజలకు అండగా, అందుబాటులో ఉంటానని తెలిపారు. డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయకుమార్ మాట్లాడుతూ డైరెక్టర్ ఇంద్ర భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు కోడిరెక్క కొటిరత్నం, చంద్ర నాయక్, ఉగ్గం సాంబశివరావు, పొందుగల ప్రకాష్, భూపతి సునీల్ కుమార్, మట్టా బాబు, దాసరి నాగరాజు, గొదా పోతురాజు, తంగెళ్ళ నాగేశ్వరరావు, తోట నాగేశ్వరరావు, ముళ్ళపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆట, పాటలతో విద్య

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. అరుణ


వంగిపురంలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ అరుణ

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్యను అందించడం జరుగుతోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.అరుణ అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం గొట్టిపాడు సెక్టార్ పరిధిలోని వంగిపురంలో, ప్రత్తిపాడు సెక్టార్ పరిధిలోని నడింపాలెం సాయిప్రభుకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిపాలు, పోషకాహారం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ వి. అరుణ మాట్లాడుతూ 3–5 సంవత్సరాల్లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మానసికంగా ఎదిగేలా రకరకాల ఆట, పాటలతో ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారన్నారు. సూపర్‌వైజర్ ఎం. వెంకటరత్నం మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు పోషక విలువలున్న అదనపు ఆహారం అందించాలని చెప్పారు. సీజనల్‌గా లభించే పండ్లు, కూరగాయల్లో అత్యధిక పోషక పదార్థాలుంటాయని వివరించారు. కరివేపాకు, మునగాకును విరివిగా వాడాలని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్త సుందరి తదితరులు పాల్గొన్నారు.

డీలర్లకు డిప్లమో కోర్సు ఉత్తీర్ణత పరీక్షలు


డీలర్లతో వ్యవసాయ శాఖ అధికారులు

గుంటూరు రూరల్: నగరంలోని వ్యవసాయశాఖ కార్యాలయం కృషి భవన్‌లో శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని విత్తనాలు, ఎరువులు పురుగు మందుల వ్యాపారం నిర్వహించే డీలర్లకు డిప్లమో ఉత్తీర్ణత పరీక్షలను నిర్వహించారు. వీరికి 52 వారాలపాటు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమేతి ద్వారా విశ్రాంత జేడీ కొరెడ్ల వేణుకృష్ణ శిక్షణ తరగతుల నిర్వహించారు. శిక్షణ పూర్తయిన అనంతరం 40 మంది డీలర్లకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షల నిర్వహణ ప్రత్యేక పరిశీలకులుగా కంచన్ భగవత్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు భూసార పరీక్షా కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శనగల రామ్మోహన్ పరీక్షల నిర్వహణ అధికారిగా వ్యవహరించారు.

15 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పొన్నూరు: ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మన్నవ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శివగోపాల్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ అడప శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ప్రజలకు ఆరోగ్యశ్రీపై అవగాహన, అనారోగ్య బాధితులను గుర్తించడం జరుగుతుందన్నారు. 15 నుంచి ప్రతి గ్రామ సచివాలయంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 12న ఏఎన్ఎంలు, వాలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అధికారులు జోసఫ్, సాంబశివరావు, రోగ్యకేంద్రం సూపర్‌వైజర్ ఎం. వేణుగోపాల్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.